బస్టాప్ వద్ద ఆటోల తిష్ట

• ప్రయాణికుల తీవ్ర అవస్థలు • బస్సుల కోసం పరుగులు • పట్టించుకోని అధికారులు



కోరమాండల్ బస్టాప్ వద్ద అడ్డంగా ప్రైవేట్ వాహనాల పార్కింగ్



శ్రీహరిపురం బస్టాప్ ముందు అడ్డంగా ఆటోలు

మల్కాపురం : పారిశ్రామిక ప్రాంత పరిధిలోని శ్రీహరిపురం, మల్కాపురం, కోరమాండల్, ఆర్‌కేపురం వంటి కూడళ్ల వద్ద కొంతమంది ఆటో డ్రైవర్ల నిర్లక్ష్యంగా కారణంగా ఆర్టీసీ బస్సు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ముఖ్యంగా ఉదయం 7 నుంచి 10 గంటల మధ్య పరిశ్రమల ఉద్యోగులు, కళాశాల విద్యార్థులు వారి గమ్యస్థానాలకు చేరుకోవడానికి బస్టాప్‌ల వద్ద వేచి ఉన్న సమయంలో ఈ సమస్య అధికంగా ఉంటోంది.

ప్రయాణికుల పరుగులు

కొంతమంది ఆటో డ్రైవర్లు తమ ఆటోలను బస్టాప్‌ల వద్ద అడ్డంగా నిలుపుతున్నారు. దీంతో ఆర్టీసీ బస్సులు నిలపడానికి చోటు లేక కొంత ముందుకు వెళ్లి ఆగాల్సి వస్తోంది. బస్సులను అందుకోవడానికి పరుగులు తీస్తున్న ఉద్యోగులు, విద్యార్థులు అడ్డంగా ఉన్న ఆటోలను తప్పించుకోలేక అదుపుతప్పి కింద పడి గాయాలపాలవుతున్నారు. కొన్నిసార్లు వారు తమ గమ్యస్థానాలకు చేరుకోలేక తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఈ ఆటోవాలాల చేష్టల వల్ల ఆర్టీసీ ఆదాయానికి కూడా గండి పడుతోందని పలువురు ప్రయాణికులు వాపోతున్నారు.

అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలి

గాజువాక ఆర్టీసీ డిపో అధికారులు, సిబ్బంది పలు కూడళ్ల వద్ద బస్టాప్‌ల వద్ద ఆటోలను నిలపకుండా చర్యలు తీసుకుంటున్నప్పటికీ, అవి ఆశించిన ఫలితాలను ఇవ్వడం లేదు. ఈ సమస్యపై అధికారులు మరింత కఠినంగా వ్యవహరించి, నిబంధనలు అతిక్రమిస్తున్న ఆటో డ్రైవర్లపై చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు, ప్రజలు కోరుతున్నారు. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే, ప్రయాణికులకు మరింత అసౌకర్యం కలగడమే కాకుండా, భద్రతా పరమైన సమస్యలు కూడా తలెత్తే అవకాశం ఉంది.

రోజూ ఇబ్బందే..



శ్రీహరిపురం బస్టాప్ వద్ద ఆటోల అడ్డంగా నిలపడం వల్ల ఇంజినీరింగ్ కళాశాలకు వెళ్లే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బస్సు ఎక్కే సమయంలో ఆటోలు అడ్డంగా ఉండటంతో తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నాం. దీంతో సమయానికి కళాశాలకు చేరుకోలేకపోవడం, కొన్నిసార్లు బస్సులను అందుకోలేకపోవడం జరుగుతోంది. ఆటోల నియంత్రణకు అధికారులు ఉపక్రమించాలి.

-విక్రమ్ యాదవ్, బీటెక్ విద్యార్థి, శ్రీహరిపురం

ఆటోలతో ఇబ్బందులు



సబ్బవరం వెళ్లేందుకు మల్కాపురం వద్ద ఆర్టీసీ బస్సు కోసం ఎదురుచూసిన నాకు కి నిరాశే ఎదురైంది. బస్సు వచ్చే సమయానికి బస్టాప్ వద్ద ఆటోలు అడ్డంగా నిలిపి ఉండటంతో బస్సు ఎక్కడం కుదరలేదు. దీంతో పనులను వాయిదా వేసుకుని ప్రయాణాన్ని రద్దు చేసుకోవాల్సి వచ్చింది. ఆటో డ్రైవర్ల నిర్లక్ష్యం కారణంగా తరచూ బస్సులు ఎక్కేందుకు ఇబ్బంది పడుతున్నాం. బస్టాప్‌ల వద్ద ఆటోలు అడ్డులేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి.

- మంగవేణి, మల్కాపురం

విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ



నోటు పుస్తకాలతో విద్యార్థులు

గోపాలపట్నం: జీవీఎంసీ 91వ వార్డులోని లక్ష్మీనగర్, బ్లాక్ పీపీ పాఠశాలలో విద్యార్థులకు సత్యసాయి అమృతం సంస్థ సభ్యులు నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్. ప్రభాకర్ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఇలాంటి సహకారాలు అందిస్తే అది ఎంతో ప్రోత్సాహకరంగా ఉంటుందని అన్నారు. మొత్తంగా 94 మంది విద్యార్థులకు రెండేసి చొప్పున నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మెట్ట మోహనరావు, చాముండేశ్వరి, వసంత లక్ష్మి, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐలో వాటర్ ప్లాంట్ ప్రారంభం



వాటర్ ప్లాంట్ వద్ద అతిథులు

కంచరపాలెం: స్థానిక ఐటీఐ జంక్షన్ వద్ద పారిశ్రామిక శిక్షణ కేంద్రంలో ఇటీవల పదవీ విరమణ చేసిన ట్రెనింగ్ ఆఫీసర్ డి.ఉమా మహేశ్వరరావు, పూర్వ విద్యార్థుల ఆర్థిక సాయంతో ప్రభుత్వ ఐటీఐ(పాత)లోని సీ–బ్లాక్ వద్ద శనివారం వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశారు. దీనిని ముఖ్య అతిథులు రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ ఆర్.వి.రమణ, అసిస్టెంట్ సాల్మన్ నాయకల్ ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మళ్ల ధనలతపై సస్పెన్షన్ ఎత్తివేత

విశాఖ సిటీ: పశ్చిమ నియోజకవర్గంలోని 60వ వార్డుకు చెందిన మళ్ల ధనలతపై సస్పెన్షన్ ఎత్తివేసినట్లు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు ఒక ప్రకటనలో తెలిపారు. కొన్ని అనివార్య కారణాల వల్ల కొద్ది రోజుల కిందట ధనలతను పార్టీ నుంచి తాత్కాలికంగా సస్పెండ్ చేసినట్లు పేర్కొన్నారు. ధనలతపై వచ్చిన ఆరోపణలపై ఆమె సమగ్ర వివరణ పార్టీకి సమర్పించడంతోపాటు భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకుంటానని హామీ ఇచ్చినట్లు వెల్లడించారు. ఈ నేపథ్యంలో పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త మళ్ల విజయ్‌ప్రసాద్ విజ్ఞప్తి మేరకు ధనలత గత సేవలను పరిగణనలోకి తీసుకుని పార్టీ నియమ నిబంధనలకు అనుగుణంగా ఆమెపై విధించిన సస్పెన్షన్‌ను ఎత్తివేస్తున్నట్లు చెప్పారు.

బెల్ట్ షాపుపై దాడి

మల్కాపురం : జీవీఎంసీ 59వ వార్డు, మాజీ సైనిక కాలనీ వద్ద ఒక పాన్‌షాపును బెల్ట్‌షాపుగా మార్చి అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఒకర్ని మల్కాపురం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆయన నుంచి మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, సదరు వ్యక్తి గత కొంత కాలంగా తన పాన్‌షాపులో అక్రమంగా మద్యం బాటిళ్లను విక్రయిస్తున్నాడు. దీనిపై పూర్తి సమాచారం అందుకున్న ఎస్ఐ శ్యామలరావు తన సిబ్బందితో కలిసి శనివారం పాన్‌షాపుపై దాడి నిర్వహించారు. ఈ దాడిలో విక్రయానికి ఉంచిన 11 క్వార్టర్ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని, సదరు వ్యక్తిపై కేసు నమోదు చేశారు.

పోతిన రాముకు ఘన నివాళి

మల్కాపురం : మాజీ ఎమ్మెల్యే పోతిన సన్యాసిరావు కుమారుడు, సీపీఐ సీనియర్ నాయకుడు, కార్మిక సంఘ నాయకుడు పోతిన రాము ఇటీవల అనారోగ్యంతో మరణించడంతో, ఆయన మృతికి సంతాపం తెలుపుతూ శనివారం 61వ వార్డు మల్కాపురం, నగరాలవీధి వద్ద సంతాప కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణ, విశాఖ కో–ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ చలసాని రాఘవేంద్రరావు, పౌర హక్కుల సంఘం నాయకులు శ్రీరామ్మూర్తి, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు అత్తిలి విమల తదితరులు హాజరయ్యారు. అక్కడ ఏర్పాటు చేసిన రాము చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఐకి, కార్మికుల సంక్షేమానికి ఆయన చేసిన సేవలను ఈ సందర్భంగా వక్తలు గుర్తుచేసుకున్నారు. ఈ సంతాప కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సెయింట్ జోసెఫ్ కళాశాలలో సైన్స్ ఫెస్ట్

కంచరపాలెం: జ్ఞానాపురంలోని సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో జంతుశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో శనివారం బయోబ్లూమ్–25 ఇంటర్ సైన్స్ ఫెస్ట్‌ను ముఖ్య అతిథి, ఫిషరీష్ సైంటిస్ట్ జీవీఏ ప్రసాద్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ ప్రారంభించారు. ఇటువంటి కార్యక్రమాలు సరికొత్త ఆవిష్కరణలకు దోహదపడతాయని అతిథులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ హేమ, కో–ఆర్డినేటర్ డాక్టర్ ఈ. హరిణి, పి.కె.జయలక్ష్మి, స్నేహ, రోసినా జార్జ్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రత పాటిద్దాం



కార్యక్రమంలో పాల్గొన్న శానిటరీ అధికారులు

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు, శ్రీహరిపురం వద్ద శనివారం స్వచ్ఛాంధ్ర–స్వర్ణాంధ్ర కార్యక్రమం ఘనంగా జరిగింది. వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ డి. రవికుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కోరాడ శ్రీను, మాజీ కార్పొరేటర్ శీరం ఉమామహేశ్వరి, పాతబత్తుల శ్రీను తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగం వల్ల పర్యావరణానికి, ఆరోగ్యానికి తీవ్ర నష్టాలు కలుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్లాస్టిక్‌కు బదులుగా క్లాత్ లేదా పేపర్ బ్యాగులను వాడాలని ప్రజలకు సూచించారు. నిత్యం పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దుకోవచ్చని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వార్డు శానిటరీ, మలేరియా విభాగాల అధికారులతో పాటు సచివాలయాల అధికారులు పాల్గొన్నారు.

మోసం, నయవంచనలో చంద్రబాబు మాస్టర్ డిగ్రీ



మాట్లాడుతున్న మళ్ల విజయప్రసాద్



పాల్గొన్న కార్యకర్తలు,అభిమానులు

• కూటమి వైఫల్యాలను ఎండగట్టిన వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త మళ్ల విజయప్రసాద్
• 59వ వార్డులో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమం

మల్కాపురం : ప్రజలను వంచించడం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నైజమని, మోసంలో ఆయనకు మాస్టర్ డిగ్రీ ఉందని వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మళ్ల విజయప్రసాద్ విమర్శించారు. 59వ వార్డు పార్టీ అధ్యక్షుడు రేవళ్ల సత్యనారాయణ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం ములగాడ హౌసింగ్ కాలనీ, వేంకటేశ్వర స్వామి ఆలయం సమీపంలో నిర్వహించిన 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ' కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజయప్రసాద్ మాట్లాడుతూ, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 14 నెలలు గడుస్తున్నా అభివృద్ధి పక్కన పెడితే, ఎన్నడూ లేని విధంగా హత్యలు, ఆడపిల్లలపై వేధింపులు వంటి నేరాలు పెరిగాయన్నారు. ఇసుక మాఫియా దందా పెరిగిపోతున్నా కూటమి నాయకులు నోరు మెదపలేని స్థితిలో ఉన్నారని ఆరోపించారు. కూటమి పార్టీలకు చెందిన కింది స్థాయి నాయకులు కూడా నేడు సెటిల్‌మెంట్లు చేసే స్థాయికి ఎదిగారంటే, దీని వెనుక ఆయా పార్టీల ముఖ్య నాయకుల ప్రోత్సాహం ఎంత ఉందో అర్థమవుతుందన్నారు. తమ నాయకుడు వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డి తనను నమ్మి ఓటు వేసిన ప్రజలకు నేరుగా ఇంటి వద్దకే సంక్షేమ పథకాలను అందించే చరిత్ర సృష్టిస్తే, నేడు కూటమి పాలనలో నమ్ముకున్న ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పుకునే పరిస్థితి వచ్చిందని మళ్ల విజయప్రసాద్ అన్నారు. తల్లికి వందనం కొంత మందికే పరిమితం అయ్యిందని, దీపం పథకం ద్వారా ఉచిత గ్యాస్ డబ్బులు ఇప్పటికీ చాలా మంది వ్యక్తిగత బ్యాంక్ ఖాతాల్లో పడలేదన్నారు. ఎన్నికల ముందు మహిళలు ఉచిత బస్సులో రాష్ట్రంలో ఎక్కడికైనా వెళ్లవచ్చని వాగ్దానాలు చేసి, నేడు జిల్లాకే పరిమితం చేస్తామని చెప్పడం ప్రజలు గమనించాలన్నారు. అధికారంలోకి వస్తే యువతకు లక్ష ఉద్యోగాలు అన్నారని, లక్ష ఉద్యోగాలు సంగతి పక్కన పెడితే ఉన్న ఉద్యోగాలకే రక్షణ లేకుండా పోయిందన్నారు. కూటమి సర్కార్ చేస్తున్న మోసాలను ప్రజలు ప్రశ్నించే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని ఆయన హెచ్చరించారు. వార్డు స్థాయి నాయకులు, కార్యకర్తలు తమ తమ పరిధిలో కూటమి నాయకుల వల్ల ప్రజలకు ఇబ్బందులు ఎదురైతే వారిని తక్షణమే ప్రశ్నించి, ప్రజలకు అండగా నిలవాలని కార్యకర్తలకు సూచించారు. పార్టీకి కష్టపడి పనిచేసిన ప్రతి ఒక్క కార్యకర్తకు తాను అండగా నిలుస్తానన్నారు. కార్యక్రమంలో ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు అనిల్‌కుమార్, వార్డు పార్టీ అధ్యక్షుడు రేవళ్ల సత్యనారాయణ, రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి పెంటారావు, విశాఖ వెస్ట్ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు భూపతి, సంపత్‌కుమార్, ఎం.అప్పారావు, ఖాన్, గాలి సన్యాసిరావు, అర్జున్, ఎదుర సన్యాసిరావు, గౌరీ, కనక పాల్గొన్నారు.

విద్యుత్ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించండి



విద్యుత్ స్మార్ట్ మీటర్ల వద్దంటూ ర్యాలీ చేస్తున్న సీపీఎం నాయకులు

మల్కాపురం : పెంచిన విద్యుత్ ఛార్జీలను తక్షణమే తగ్గించాలని, అలాగే అదానీ విద్యుత్ స్మార్ట్ మీటర్లను ఎవరూ ప్రోత్సహించవద్దని సీపీఎం మల్కాపురం జోన్ కార్యదర్శి పి.పైడిరాజు ప్రజలకు పిలుపునిచ్చారు. స్మార్ట్ మీటర్ల అంశంపై శనివారం మల్కాపురం సీపీఎం జోన్ కమిటీ ఆధ్వర్యంలో 61వ వార్డులోని నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పైడిరాజు మాట్లాడుతూ గత ప్రభుత్వం ట్రూ అప్ చార్జీల పేరుతో ప్రజలపై భారం మోపుతుందని గగ్గోలు పెట్టిన టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు ఇప్పుడు తమ కూటమి ప్రభుత్వంలో ఎన్నడూ లేని విధంగా విద్యుత్ చార్జీలను పెంచారని విమర్శించారు. అంతేకాకుండా, అదానీకి చెందిన విద్యుత్ స్మార్ట్ మీటర్లను ఇంటింటికీ బిగించేందుకు చర్యలు చేపడుతున్నారని, దీనిపై వారు ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. గతంలో జగన్ ప్రభుత్వం తప్పు చేసిందని భూతద్దంలో చూపిన వీరు, నేడు చేస్తున్నది ఏమిటని పైడిరాజు ఆవేదన వ్యక్తం చేశారు. నమ్మి ఓట్లు వేసిన ప్రజలకు ఇదేనా మీరు చేసే మేలు అని నిలదీశారు. తమ ఇంటికి ఎవరైనా విద్యుత్ స్మార్ట్ మీటర్లను తీసుకువస్తే వెంటనే వారిని వెనక్కి పంపించాలని, లేకుంటే ప్రతి నెల ఆర్థిక భారం తప్పదని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఉరుకూటి బాబూరావు యాదవ్, ఎస్.ఉమ, విజయ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

సెల్ టవర్ నిర్మించొద్దు

గోపాలపట్నం: తమ ప్రాంతంలో సెల్ టవర్ నిర్మించ వద్దంటూ స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. జీవీఎంసీ 89వ వార్డు కొత్తపాలెం సంతోషనగర్‌లో ఒక ప్రైవేట్ టెలిఫోన్ సంస్థ సెల్ టవర్ నిర్మించేందుకు సన్నాహాలు చేస్తోంది. దీనిపై స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. తమ ప్రాంతంలో టీఏఆర్ నగర్, సంతోష్‌నగర్ పరిసర ప్రాంతాలు అభివృద్ధి చెందుతున్నాయని, ఇక్కడ సెల్ టవర్ ఏర్పాటు చేయడం వల్ల ఇబ్బందులు పడతామని వాపోతున్నారు. ఈ మేరకు శనివారం స్థానికులంతా సెల్ టవర్ నిర్మించే స్థలం వద్ద ఆందోళన కార్యక్రమం చేపట్టారు. దీని నిర్మాణానికి స్థలం ఇచ్చిన వ్యక్తులతో వారు చర్చించారు. దీనిపై స్థానికంగా వచ్చిన అభ్యంతరాలను దృష్టిలో ఉంచుకుని సెల్ టవర్ నిర్మాణ సంస్థతో మాట్లాడి రద్దు చేసుకుంటామని స్థల యజమానులు హామీ ఇచ్చారు. దీంతో స్థానికుల ఆందోళన సద్దుమణిగింది. కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ చైర్మన్ ఆళ్ల పైడిరాజు, మళ్ల శ్రీనివాసరావు, గవర నాయుడు తదితరులు పాల్గొన్నారు.



సంతోష్‌నగర్‌లో సెల్ టవర్ నిర్మించే స్థలం వద్ద ఆందోళన చేస్తున్న స్థానికులు

ప్లాస్టిక్ నియంత్రణతోనే ఆరోగ్యానికి రక్షణ

• పర్యావరణ పరిరక్షణలో అంతా భాగస్వామ్యం కావాలి
• స్త్రీ శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ అధికారి నీలిమ



కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ఆవరణను శుభ్రం చేస్తున్న వైద్య సిబ్బంది



తల్లులతో కలిసి ప్రతిజ్ఞలో పాల్గొన్న సీడీపీవో నీలిమ



ఆర్పీ పేట హైస్కూల్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

విశాఖ విద్య: ప్లాస్టిక్ వస్తువుల వినియోగాన్ని పూర్తిగా నివారించి, ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని స్త్రీ శిశు సంక్షేమ శాఖ అర్బన్ ప్రాజెక్ట్ అధికారిణి కె.నీలిమ పిలుపునిచ్చారు. శనివారం జీవీఎంసీ 52వ వార్డు పరిధిలోని గౌరీనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన 'స్వచ్ఛాంధ్ర–స్వర్ణాంధ్ర' కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా నీలిమ బాలింతలు, తల్లులు, కేంద్రంలోని చిన్నారులతో కలిసి అవగాహన ర్యాలీలో పాల్గొన్నారు. అంగన్‌వాడీ టీచర్లతో పాటు కేంద్రానికి వచ్చిన తల్లులు, బాలింతలు, కాలనీ వాసులకు ఆరోగ్యపరమైన అంశాలపై ఆమె అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వాడకం వల్ల అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని గుర్తు చేస్తూ, ప్లాస్టిక్ భూతాన్ని పూర్తిగా నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరి సహకారం అవసరమన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారానే అనారోగ్యాలకు దూరంగా ఉండవచ్చని ఆమె స్పష్టం చేశారు. 'ప్లాస్టిక్ నివారణ మన అందరి బాధ్యత' అంటూ వారందరితో ప్రతిజ్ఞ చేయించారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని, గర్భిణులు నకాలంలో అంగన్‌వాడీ కేంద్రంలో నమోదు చేసుకోవాలని నీలిమ సూచించారు. ప్రతి కేంద్రంలో ప్రీ స్కూల్ నిర్వహించడం ద్వారా బాలల భవిష్యత్తుకు పటిష్టమైన పునాదులు వేయడం జరుగుతుందని, పిల్లలను తప్పనిసరిగా ప్రతిరోజూ అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని తల్లిదండ్రులకు సూచించారు. అంగన్‌వాడీల ద్వారా సేవలను మరింత విస్తృతం చేయడానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని ఆమె తెలిపారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జె.టి.ఎన్. జ్యోతి, అంగన్‌వాడీ టీచర్ మార్తా తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన

గోపాలపట్నం: 'స్వచ్ఛాంధ్ర–స్వర్ణాంధ్ర' కార్యక్రమంలో భాగంగా గోపాలపట్నంలో పారిశుద్ధ్యం, ప్లాస్టిక్ వినియోగంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. గోపాలపట్నం కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో వైద్యులు, సిబ్బంది శుభ్రత కార్యక్రమం చేపట్టారు. అనంతరం ఆస్పత్రి ప్రాంగణంలో ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రి సూపరింటెండెంట్ సుజాత మాట్లాడుతూ పారిశుద్ధ్యానికి తొలి ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. సిబ్బందికి, వ్యాధిగ్రస్తులు, వారి కోసం వచ్చే వారు సహకరించాలని, వ్యర్థాలను నిర్దేశించిన బిన్‌లలోనే వేయాలని సూచించారు. గోపాలపట్నం రైతుబజార్‌లో 'స్వచ్ఛాంధ్ర–స్వర్ణాంధ్ర' కార్యక్రమంలో భాగంగా ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కార్యక్రమాన్ని జీవీఎంసీ 92వ వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ గోపి నిర్వహించారు. ప్లాస్టిక్ వాడటం వల్ల కలిగే అనర్థాలను ఆయన వివరించారు. కార్యక్రమంలో రైతుబజార్ ఈవో ప్రసాద్, స్థానిక నాయకులు దాడి రమేష్, సచివాలయం కార్యదర్శులు శివ, శ్రీనాథ్, రైతులు, మహిళలు పాల్గొన్నారు.

కంచరపాలెం: జీవీఎంసీ 56వ వార్డు కంచరపాలెం రామ్మూర్తిపంతులుపేట ఉన్నత పాఠశాలలో శనివారం స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయిని ఎం.రాజ్యలక్ష్మి మాట్లాడుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను పూర్తిగా నిర్మూలించాలని, పర్యావరణ పరిరక్షణకు అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. 'ప్లాస్టిక్‌ని నిరోధిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదాం ' అనే నినాదంతో విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ఉపాధ్యాయులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సచివాలయ శానిటరీ కార్యదర్శులు పాల్గొన్నారు.



తల్లులతో కలిసి ప్రతిజ్ఞలో పాల్గొన్న చిన్నారులు

కొండవాలు ప్రాంతాల్లో సమస్యల పరిశీలన

సింథియా: జీవీఎంసీ 63వ వార్డు కాకరలోవ, జైఆంధ్రా కాలనీ తదితర కొండవాలు ప్రాంతాల్లో శనివారం స్టాండింగ్ కమిటీ సభ్యుడు, కార్పొరేటర్ గల్లా చిన్నా పర్యటించారు. కొండవాలు ప్రాంతాల్లో మంచినీటి సరఫరా, కొత్త విద్యుత్ స్తంభాలు, వీధి దీపాల సమస్యలను తెలుసుకుని, అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తామని నివాసులకు ఆయన హామీ ఇచ్చారు. పారిశుధ్య కార్మికులను పిలిపించి కాలువలను శుభ్రం చేయించారు. కార్యక్రమంలో ఎలక్ట్రికల్ లైన్‌మెన్ శ్రీను, మంచినీటి విభాగం లైన్‌మెన్ సింహాచలం, శానిటరీ విభాగం సూపర్‌వైజర్ కొండలరావు, వార్డు ప్రెసిడెంట్ జెర్రిపోతుల నర్సింగరావు, వార్డు సెక్రటరీ గూడెల కృష్ణ, పాల్గొన్నారు.